సాక్షి
కుమురం భీం

శనివారం । 27 । జూలై । 2024



మీరే మాకు స్ఫూర్తి
పారిస్ ఒలింపిక్స్ సంబురం ప్రారంభమైంది. భారత ఆటగాళ్లు పతకాల పంట పండించాలని జిల్లా క్రీడాకారులు ఆకాంక్షిస్తున్నారు.

8లో▸

30 మిల్లీమీటర్ల వర్షపాతం
ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో శుక్రవారం 30 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. చింతలమానెపల్లి మండలంలో 74.2 మిల్లీమీటర్లు, జైనూర్ 18.4, లింగాపూర్ 16.2, , రెబ్బెన 24.4, ఆసిఫాబాద్ 18.8, వాంకిడి 22.4, కాగజ్‌నగర్ 19.6, సిర్పూర్(టి) 49.0, కౌటాల 56.2, చింతలమానెపల్లి 74.2, బెజ్జూర్ 38.2, పెంచికల్‌పేట్ 44.6, దహెగాం లో 45.6 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
27.8 /24.5

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక పునరావాస పథకం



చెక్కు ఇస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్అర్బన్: ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం ఆర్థిక పునరావాస పథకం అమలు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్‌తో కలిసి శుక్రవారం ఇద్దరు ట్రాన్స్‌జెండర్లకు 2022- 23 సంవత్సరానికి ఆర్థిక పునరావాస పథకం కింద చెక్కులు అందించారు. ట్రాన్స్‌జెండర్లలో అర్హత గల వారికి గుర్తింపుకార్డులు అందిస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఆర్థిక పునరావాస పథకం కింద రూ.50వేల చొప్పున నగదు అందించినట్లు తెలిపారు. ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రవికుమార్ ఉన్నారు.

అంతర్రాష్ట్ర ఫారెస్ట్ చెక్‌పోస్టు సందర్శన



చెక్‌పోస్టు వద్ద ట్రెయినీ అధికారులు

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర అటవీ చెక్‌పోస్టును తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ దూలపల్లి 35వ బ్యాచ్ ట్రియినీ అధికారులు శుక్రవారం సందర్శించారు. తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్ రామ్మోహన్‌రావు, ఎఫ్ఎస్‌వో భగవంత్‌రావు, ఎఫ్‌బీవో రజిత ఉన్నారు.


విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలి





మాట్లాడుతున్న డీఈవో అశోక్


ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్) శిక్షణ కార్యక్రమానికి హాజరైన రిసోర్స్‌పర్సన్లకు సూచనలు చేశారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. ప్రతిరోజూ తరగతి గదిలో ప్రవేశించడానికి ముందే ఆ పాఠ్యాంశానికి సంబంధించి కనీస అభ్యసన సామర్థ్యాలు ఏం ఉన్నాయి? ఏ విధంగా సాధింపజేయాలి..? అని పాఠ్య ప్రణాళికలు, బోధన అభ్యసన సామగ్రి రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో శ్రీనివాస్, హెచ్ఎం సుభాష్ పాల్గొన్నారు.

కాస్త మెరుగు!









- జీడీడీపీ, తలసరి ఆదాయంలో స్వల్ప వృద్ధి
- గడిచిన పదేళ్ల అభివృద్ధిలో కాస్త ఊరట
- రాష్ట్రంలోని జిల్లాలతో పోలిస్తే ఇంకా వెనుకబాటే
- సామాజిక ఆర్థిక ముఖచిత్రం– 2024లో వెల్లడి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆర్థిక, సామాజిక వృద్ధిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంకా ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. ఆదాయ, ఉత్పత్తి, వినియోగం తదితర రంగాల్లో ఆశించిన మేర అభివృద్ధి జరగడం లేదు. గతంతో పోలిస్తే కాస్త మెరుగుపడినా, ఇంకా ఎంతగానో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. నాలుగు జిల్లాల పరిధిలో కుమురంభీం అన్నింటా వెనుకబడి ఉండగా, మంచిర్యాల, నిర్మల్ ముందంజలో ఉన్నాయి. ఇక రాష్ట్రంలో 33 జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి జిల్లా ఎంతో మెరుగుపడాల్సిలింది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ముందు ఏటా విడుదల చేసే సామాజిక ఆర్థిక ముఖ చిత్రం 2024లో ఈ వివరాలు స్పష్టం చేస్తున్నాయి.

స్వల్పంగానే వృద్ధి..

స్థూల జిల్లా జాతీయోత్పత్తిలో ఇంకా పెరుగుదల అంతంతమాత్రంగానే ఉన్నాయి.ఒక జిల్లా పరిధిలో ఏడాదిలో జరిగిన అంతిమ, వస్తుసేవల ఉత్పత్తిని ఆ జిల్లా జాతీయోత్పత్తిగా గుర్తిస్తారు. ఉమ్మడి జిల్లాలో జీడీడీపీ (గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్స్) చూస్తే, ఇంకా అంతరాలు కనిపిస్తున్నాయి. కుమురంభీం, మంచిర్యాల మధ్య సగం వరకు వ్యత్యాసం ఉంది. రాష్ట్రంలో 33జిల్లాల్లో రంగారెడ్డి జిల్లా టాప్‌లో ఉండగా, మంచిర్యాల18, ఆదిలాబాద్24, నిర్మల్ 25, కుమురంభీం జిల్లా 32వ స్థానంలో నిలిచాయి. అంటే రాష్ట్రంలో అధిక ఆదాయం నమోదయ్యే మొదటి ఐదు స్థానాల్లో ఉమ్మడి జిల్లా లేకపోవడం గమనార్హం. గడిచిన రెండేళ్లుగా కుమురంభీం జిల్లా రాష్ట్రంలో చివరి నుంచి రెండో స్థానానికే పరిమితం కావడం వెనుకబాటు తనానికి నిదర్శనం.

'తలసరి'లో అంతరాలు

జిల్లా జనాభాను ఆ జిల్లా జాతీయోత్పత్తితో భాగిస్తే వచ్చేదే జిల్లాలోని పౌరుల తలసరి ఆదాయం. ఉమ్మడి జిల్లాలో తలసరి ఆదాయంలోనూ అంతరాలు కనిపిస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో ఎక్కువగా ఉంది. అయితే కుమురంభీం జిల్లాలో జనాభా తక్కువగా ఉండడంతో తలసరి ఆదాయం పెరిగినట్లుగా కనిపిస్తుంది. రాష్ట్రంలో రంగారెడ్డి ప్రథమ స్థానంలో ఉండగా, మంచిర్యాల 18, నిర్మల్ 21, ఆదిలాబాద్ 22, కుమురంభీం జిల్లా 32 స్థానాల్లో నిలిచాయి. అంటే జిల్లా పౌరుల సగటు ఆదాయం ఇంకా తక్కువగానే ఉంది.



అడవుల రక్షణ మెరుగు

అడవుల రక్షణ, పెంపు కోసం గడిచిన పదేళ్లలో నిధుల ఖర్చు క్రమంగా పెరుగుతోంది. దీంతో జిల్లాలో అడవుల పెంపునకు దోహదపడుతోంది. ముఖ్యం 'కంపా' (కంపన్సెటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ) కింద నిధులు ఖర్చు చేస్తున్నారు. దీంతో అడవులు వృద్ధి చెందుతున్నాయి.

సగటు కమతం తక్కువే..

ఉమ్మడి జిల్లాలో భూమి సాగుదారుల మధ్య ఇంకా వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. సగటు కమతం చూస్తే అతితక్కువగా ఉంది.

ఆదుకుంటున్న ఉపాధి హామీ పథకం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ కనీసం ఏడాదిలో వంద పని దినాలు కల్పించాలనే లక్ష్యంగా కొనసాగుతున్న మహాత్మాగాంధీజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జిల్లాలో మెరుగుపడుతోంది. కూలీల పని దినాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఎంచుకున్న లక్ష్యం, కూలీల నమోదులో వృద్ధి కనిపిస్తోంది.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం..

ఏటేటా ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలతో క్రమంగా విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నాయి. గృహావసరాలతోపాటు వ్యవసాయ, వ్యాపార, పరిశ్రమ ఆధారిత కనెక్షన్లలో వృద్ధి కనిపిస్తోంది. గతేడాదితో పోలిస్తే విద్యుత్ కనెక్షన్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

రోడ్డు సౌకర్యం మెరుగు

రోడ్ల సాంద్రత మెరుగుపడుతోంది. అయినా జిల్లా జనాభాకు ఇంకా సరిపడా రోడ్లు విస్తరించాల్సి ఉంది. నిర్మల్‌లో అధికంగా, కుమురంభీంలో తక్కువగా రోడ్ల సాంద్రతను కలిగి ఉన్నాయి.

ప్రజా పంపిణీ వ్యవస్థ

ప్రజాపంపిణీ వ్యవస్థ జిల్లాలో పటిష్టంగా ఉంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ప్రతినెలా చౌకధరల దుకాణాల్లో బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతోంది. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల నమోదు, గ్యాస్‌వాడకం పెరుగుతూ వస్తోంది.

మొత్తం స్కూళ్లు (2022-23)

జిల్లా	స్కూల్స్
ఆదిలాబాద్	1,433
కుమురంభీం	1,239
మంచిర్యాల	1,044
నిర్మల్	1,036

అంగన్‌వాడీ కేంద్రాలు (2023-24)

జిల్లా	అంగన్‌వాడీ సెంటర్లు	నమోదైన పిల్లలు
ఆదిలాబాద్	1,256	52,673
కుమురంభీం	973	40,931
మంచిర్యాల	969	40,919
నిర్మల్	926	49,884

'ఉపాధి హామీ' పని దినాలు (లక్షల్లో)

జిల్లా	లక్ష్యం	నమోదు	చేరుకుంది
మంచిర్యాల	22.5	27.5	122%
ఆదిలాబాద్	36.6	44.6	122%
కుమురంభీం	31.7	37.7	119%
నిర్మల్	52.5	56.8	108%

జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు..(లక్షల్లో)

జిల్లా	డొమెస్టిక్	వ్యవసాయం	పరిశ్రమ, ఇతర
కుమురంభీం	81.5	7.6	10.9
ఆదిలాబాద్	76.3	11.6	12.1
మంచిర్యాల	74.8	13.4	11.7
నిర్మల్	68.8	20.8	10.4

రేషన్ కార్డులు...(2023-24)

జిల్లా	రేషన్ దుకాణాలు	మొత్తం రేషన్ కార్డులు
ఆదిలాబాద్	356	1,91,761
కుమురంభీం	308	1,39,775
మంచిర్యాల	423	2,19,180
నిర్మల్	412	2,08,463

బడులు మూత.. విద్యార్థుల గోస

- వరదలతో టీచర్లు రాక తెరుచుకోని ప్రభుత్వ పాఠశాలలు



టీచర్లు రాకపోవడంతో సోమిని పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న విద్యార్థులు

బెజ్జూర్: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో వాగులు ఉప్పొంగుతుండటంతో బెజ్జూర్ మండలంలోని పదికి పైగా పాఠశాలలకు ఉపాధ్యాయులు రావడం లేదు. బడులు తెరుచుకోకపోవడంతో విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. బెజ్జూర్ మండలంలోని సోమిని, మొగవెల్లి, సుశ్మీర్, తలాయి, తిక్కపల్లి, భీమారం, ఇప్పలగూడ, నాగేపల్లి, గెర్రెగూడ, పాతసోమిని, కోయపల్లి, కొత్త గెర్రె, పాత గెర్రె గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులు రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బెజ్జూర్ మండల కేంద్రంతోపాటు కాగజ్‌నగర్ పట్టణం నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఒర్రెలు, వాగులు ఉప్పొంగడంతో ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరుకోలేకపోతున్నారు. టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



చికిత్స పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

వాంకిడి(ఆసిఫాబాద్): వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలతోపాటు ప్రభుత్వ ఆస్పత్రిని డీఎంహెచ్‌వో తుకారాంతో కలిసి శుక్రవారం సందర్శించారు. పాఠశాల ఆవరణను నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. మురుగునీటి కాలువ అధ్వానంగా ఉండటంతో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అవుట్ పేషంట్, ఇన్‌పేషంట్‌ల వివరాలు తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూడాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో నజ్రుల్లాఖాన్, ఎంపీవో ఖాజా అజిజుద్దీన్, వైద్యుడు వినయ్ ఉప్రే, ఏపీవో శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

తగ్గని ప్రాణహిత ఉధృతి

- వేలాది ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- గ్రామాల చేరువలోకి వరద
- నిత్యావసరాలు లేక ప్రజలకు ఇబ్బందులు
- సహాయక చర్యలు చేపట్టని అధికారులు



గూడెం వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది

చింతలమానెపల్లి/దహెగాం/పెంచికల్‌పేట్: ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వారం రోజులుగా చింతలమానెపల్లి మండలంలోని దిందా, కోయపెల్లి నుంచి ప్రజలు బయటికి రాలేక నిత్యావసరాలకు సైతం ఇబ్బంది పడుతున్నారు. దిందాకు వెళ్లే మార్గంలో వాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోగా.. కోయపెల్లికి రెండువైపులా ప్రాణహిత వరద నీరు చేరింది. దిందాకు ఒక వైపు వాగు ప్రవాహం.. మరోవైపు నుంచి ప్రాణహిత నీరు చేరింది. శుక్రవారం వర్షం తగ్గుముఖం పట్టగా నాయకపుగూడ, శివపెల్లి గ్రామాలకు వెళ్లే మార్గంలోని వాగుల్లో వరద ఉధృతి తగ్గింది. రణవెల్లి, బూరెపల్లి, కోర్సిని, దిందా, చిత్తాం, గూడెం, కోయపెల్లి, బూరుగూడ గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూముల్లోకి వరద చేరింది. సుమారుగా నాలుగు వేల ఎకరాలు నీట మునిగినట్లు అంచనా. చింతలమానెపల్లి నుంచి మహారాష్ట్రలోని అహేరికి వెళ్లే మార్గంలోని గూడెం వద్ద ప్రాణహిత నది వంతెనను తాకుతూ ప్రవహిస్తోంది. పెంచికల్‌పేట్ మండలం మురళీగూడ, జిల్లెడ, నందిగామ, కమ్మర్‌గాం గ్రామాల్లోని ప్రాణహిత పరీవాహక ప్రాంతంలో సుమారు 500 ఎకరాల్లో పంటలు వారం రోజులుగా వరద నీటిలోనే మునిగి ఉన్నాయి. మురళీగూడ, జిల్లెడ గ్రామాల సమీపంలోకి వరద చేరింది. దహెగాం మండలంలో ఐదు రోజులుగా వరదలోనే పంటలు మునిగి ఉన్నాయి. శుక్రవారం ఉదయం ప్రాణహిత ఉధృతి పెరిగి మొట్లగూడ సమీపంలోకి వరద చేరింది. సుమారు రెండు వేల ఎకరాల్లో పత్తి పంట నీట మునిగిందని స్థానికులు తెలిపారు.

సహాయక చర్యలేవి..?

రోజుల తరబడి గ్రామాలు వరద ముంపు పరిస్థితులు ఉన్నా అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వరద ఉన్న చోట బయటకు రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. గతంలో దిందాలో ఒక గర్భిణిని నాటుపడవలో తరలించాల్సి వచ్చింది. సహాయక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మొట్లగూడ సమీపంలోకి చేరిన వరద



కోయపెల్లికి వెళ్లే మార్గంలో నీట మునిగిన రహదారి

ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి

- జిల్లా కేంద్రంలోని పలు కాలనీలకు చెత్తబండ్లు రావడం లేదు
- చెత్త పేరుకుపోవడంతో దోమల వృద్ధి
- ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి పట్టణ సమస్యలు
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు అనూహ్య స్పందన



ఫోన్‌ఇన్ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సిబ్బంది

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఇళ్ల, ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని, కాలనీల్లోకి రెగ్యులర్‌గా చెత్తబండ్లు రావడం లేదని ఆసిఫాబాద్ పట్టణ ప్రజలు సమస్యలు ఏకరువు పెట్టారు. పారిశుద్ధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలపై 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. నిధుల సమస్య ఉందని, ఏజెన్సీ నుంచి మున్సిపాలిటీగా విడిపోయినా హద్దుల గుర్తించాల్సి ఉందని కమిషనర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలో 144 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారని, నెలకు రూ.1.05 కోట్ల ఆదాయం ఉండగా, రూ.2.7 కోట్ల ఖర్చు ఉందని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు, డబ్ల్యూవో రమేశ్, ఆర్ఐ ఆనందం, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్న: జిల్లా కేంద్రంలో రెండు నెలలుగా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. ఐదు నెలలుగా రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా లొకేషన్ ఏరియా కనిపిస్తలేదని చెబుతున్నారు.

– ఎండీ అహ్మద్, షేక్ ఆరిఫ్, ఉస్మానియా మసీద్ ఏరియా/ఎండీ కలీం, ఆర్ఆర్ కాలనీ

కమిషనర్: టౌన్ ప్లానింగ్ సమస్య ఉంది. డీఎంఏ నుంచి డీఆర్‌పీ రావాలి. నాలుగు రోజులుగా మున్సిపల్ హద్దుల సర్వే కొనసాగుతోంది. సాంకేతిక సమస్య ఉంది.

ప్రశ్న: కూరగాయల మార్కెట్‌లోకి ట్రైసైకిల్ వెళ్లేలా రోడ్డుకు అడ్డంగా ఉన్న దుకాణాలు తొలగించాలి. దివ్యాంగులు మార్కెట్‌లోని వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

– ఇస్లాంబిన్ హసన్, వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు

కమిషనర్: కూరగాయల మార్కెట్ ఏజెన్సీ ప్రాంతంలో ఉంది. సమస్య పరిష్కరించేందు కు సిబ్బందిని పంపించి రోడ్డుపై కూరగాయల దుకాణాలు తొలగిస్తాం. దివ్యాంగులు మార్కెట్‌లోకి వెళ్లేందుకు మార్గం సుగమమం చేస్తాం.

ప్రశ్న: ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

– దుర్గం దినకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి

కమిషనర్: బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తాం. రేపటి వరకు సిబ్బందిని పంపించి చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రం చేస్తాం.

ప్రశ్న: ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు మా స్థలంలో వెంచర్ చేసి టీటీసీపీ అనుమతికి దరఖాస్తు చేసుకున్నాం. మున్సిపాలిటీ అయినా ఇప్పటివరకు అనుమతి రాలేదు. వెంటనే అప్రూవల్ ఇవ్వాలి.

– తాటిపెల్లి దిలీప్, వ్యాపారి

కమిషనర్: ఆసిఫాబాద్ మున్సిపాలిటీ, రాజంపేట పంచాయతీలకు సంబంధించిన హద్దులు గుర్తించాల్సి ఉంది. ప్రస్తుతం సర్వే కొనసాగుతోంది. సాంకేతిక సమస్యతో లాగిన్ అవడం లేదు. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: పైకాజీనగర్‌లో డ్రెయినేజీలు లేక రోడ్డు, ఖాళీ ప్లాట్లలో మురుగు నిలుస్తోంది. దోమలు వృద్ధి చెందడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. డ్రెయినేజీలు నిర్మించాలి.

– నీలేశ్ జన్నావార్, కావం వినేశ్, పైకాజీనగర్

కమిషనర్: పైకాజీనగర్ కాలనీని సందర్శించి సమస్య పరిశీలిస్తాం. డ్రెయినేజీల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం.

ప్రశ్న: పది రోజులుగా చెత్తబండి రావడం లేదు.. వీధి దీపాలు కూడా వెలగడం లేదు.

– శ్రీనివాస్, పైకాజీనగర్

కమిషనర్: నాలుగు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో చెత్తబండ్లు బయటకు వెళ్లడం లేదు. చెత్త బండ్లు వెంటనే పంపిస్తాం. వీధిదీపాలు ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: దస్నాపూర్, ఎస్పీ క్యాంపు కార్యాలయం తదితర ప్రాంతాల్లో వీధికుక్కల సమస్య ఉంది. అక్రమ కట్టడాలతో డ్రెయినేజీలు కుచించుకుపోతున్నాయి.

– అవుడపు ప్రణయ్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు, దస్నాపూర్/ సాంగ్డే జీవన్, రాజంపేట/ శివరామకృష్ణ, వాసవీనగర్

కమిషనర్: గతంలో మాదిరి వీధి కుక్కలు చంపడానికి లేదు. హైదరాబాద్‌లోని ఏజెన్సీని సంప్రదించాం. కుక్కలను పట్టుకుని ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేస్తారు. కుక్కలు, కోతుల బెడద నివారించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: వివేకానంద చౌక్‌లో రోడ్డుపై నీరు నిలుస్తోంది. డ్రెయినేజీ నిర్మించాలి. **– రవి, ఆసిఫాబాద్**

కమిషనర్: రోడ్డు మధ్యలో వర్షపు నీరు నిలుస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. వర్షపు నీరు డ్రెయినేజీలోకి వెళ్లేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పోచమ్మ గుడి ప్రాంతంలో వర్షం నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందవుతోంది. డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలి.

– ప్రదీప్ దేశ్‌ముఖ్/ కొలిప్యాక వసంత్/ కీర్తి, పోచమ్మ కాలనీ

కమిషనర్: పోచమ్మ గుడి ప్రాంతాన్ని ఇప్పటికే సందర్శించి సమస్య తెలుసుకున్నాం. రోడ్డుకు అడ్డంగా ఓ వ్యక్తి గోడ కట్టడంతో రోడ్డుపై నీరు నిలుస్తుంది. సమస్య పరిష్కరిస్తాం.

ప్రశ్న: వర్షం పడితే దారులు చిత్తడిగా మారుతున్నాయి. సీసీరోడ్లు లేక ఇబ్బందవుతుంది.

– రవికాంత్, డ్రైవర్స్ కాలనీ, జన్కాపూర్

కమిషనర్: రోడ్డుపై బురదగా ఉంటే తాత్కాలికంగా ఇసుక వేసి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: గాంధీ చౌక్, వివేకానంద చౌక్, ప్రధాన మార్కెట్ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్లు లేవు. మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు విన్నవించాం.

– గొడిసెల కార్తీక్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కమిషనర్: జిల్లా కేంద్రంలోని ప్రధాన మార్కెట్‌లో టాయిలెట్ల సమస్య ఇప్పటికే తమ దృష్టికి వచ్చింది. మూడు ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు, అనుమతి రాగానే నిర్మిస్తాం.

ప్రశ్న: పైకాజీనగర్‌లోని ఆంజనేయులు సామిల్ సమీపంలో అసంపూర్తి డ్రెయినేజీలో ప్రమాదవశాత్తు పిల్లలు పడుతున్నారు. డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలి. **–రమేశ్, పైకాజీనగర్**

కమిషనర్: కాలనీని సందర్శించి సమస్యను వేగంగా పరిష్కరిస్తాం.

క్లుప్తంగా

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

రెబ్బెన: అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీల్లో భాగంగా ఐచర్ వ్యాన్‌ను తనిఖీ చేశారు. అందులో 15 ఎద్దులు, 8 గేదెలను అక్రమంగా కౌటాల నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. వ్యాన్ డ్రైవర్‌తో పాటు పశువుల అక్రమ రవాణాకు పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిషేధిత ఆన్‌లైన్ గేమ్ ఆడిన వ్యక్తి అరెస్టు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వం నిషేధించిన యాప్ అప్లికేషన్‌ను ఉపయోగించి ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. మండలంలోని కసాబ్‌వాడీకి చెందిన షేక్ ఉమర్ మొబైల్‌లో ప్రభుత్వం నిషేధించిన ఆన్‌లైన్ గేమ్ ఆడుతుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి రూ.వెయ్యితోపాటు ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సై గంగన్న, పీసీ సంజీవ్ పాల్గొన్నారు.

లారీ అదుపుతప్పి బోల్తా

కోటపల్లి: మండలంలోని ఎర్రాయిపేట గుమ్మడితోట వద్ద లారీ అదుపుతప్పి బోల్తా పడింది. చెన్నూర్ వైపు నుంచి కొల్లూర్‌కు వెళ్తుండగా శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో డ్రైవర్ అతివేగంతోనే లారీ అదుపు తప్పి బోల్తాపడింది. స్థానికులు గమనించి డ్రైవర్‌ను క్షేమంగానే బయటికి తీశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

గోడ కూలి వృద్ధురాలి మృతి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని గంగారాంబస్తీకి చెందిన వృద్ధురాలు తాండ్ర కొమురమ్మ (58) పారుగింటి గోడ కూలి శుక్రవారం మృతి చెందింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం ..తాగునీటి కోసం ఇంటి ఆవరణలో బోరు వద్దకు కొమురమ్మ వెళ్తుండగా ఆకస్మాత్తుగా గోడ కూలి అక్కడికక్కడే చనిపోయింది. మృతురాలి కుమార్తె సునీత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- నాడు తండ్రి, నేడు తల్లిని కోల్పోయిన కుమార్తెలు

మందమర్రిరూరల్: పేద కుటుంబంపై విధి వంచించింది. పదేళ్ల క్రితం ఇంటి పెద్దదిక్కైన తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా, ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన తల్లి చికిత్స పొందుతూ చనిపోయింది. వారి ఇద్దరి కుమార్తెలు అనాథలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఊరుమందమర్రికి చెందిన భూనేని దూనాచారి, లక్ష్మి (45) దంపతులకు అర్చన, అభిలాష్ ఉన్నారు. లక్ష్మి తన అన్న చందు ఇంటి వద్ద ఉండి కూలీ పనికి వెళ్తూ ఇద్దరి పిల్లలను ప్రభుత్వ బడిలో చదివిస్తుంది. పది రోజుల క్రితం లక్ష్మీ ఇంటి సమీపంలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి తలకు తీవ్రగాయమైంది. స్థానికులు మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు పంపించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందింది. శుక్రవారం లక్ష్మి అంత్యక్రియలు స్థానికులతో కలిసి ఇద్దరు కూతుళ్లు నిర్వహించారు.

మీరే మాకు స్ఫూర్తి



అల్ ది బెస్ట్ తెలుపుతున్న ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు

- గిరిజన క్రీడా పాఠశాలలో ఒలింపిక్స్ సెలబ్రేషన్స్
- భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థులు



ఆసిఫాబాద్‌రూరల్: పారిస్‌లో ప్రారంభమైన ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనే భారతదేశం నుంచి పాల్గొనే క్రీడాకారులు సత్తాచాటి పతకాలు సాధించాలని ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఆల్ ది బెస్ట్ చెప్పారు. పాఠశాలలో ఒలింపిక్స్ సెలబ్రేషన్స్ జరిగాయి. జిల్లాకేంద్రంలోని క్రీడా మైదానంలో జాతీయ పతకాలు చేత పట్టుకొని చీర్ ఫర్ ఇండియా నినాదంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీటీడీవో రమాదేవి మాట్లాడుతూ భవిష్యత్తులో గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులు ఒలింపిక్స్‌లో పాల్గొనాలని ఆకాంక్షించారు. క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలన్నారు. ఏసీఎంవో ఉద్ధవ్, డీఎస్‌వో మీనారెడ్డి, ఏటీడీవో క్షేత్రయ్య, హెచ్‌ఎం కృష్ణారావు, అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పతకం సాధించాలి



ఒలింపిక్స్ క్రీడల్లో పతకం సాధించాలని లక్ష్యం పెట్టుకున్నాను. గత సంవత్సరంలో భూటాన్‌లో జరిగిన అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొని పతకం సాధించాలనే లక్ష్యంతో రోజు శ్రమిస్తున్నాను.

– తనిష్క్, మోడల్ స్కూల్ ఇంటర్

ఒలింపిక్స్‌లో చూడాలి



గిరిజన జిల్లా క్రీడా పాఠశాల నుంచి విద్యార్థులు క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నాను. ఇప్పటి వరకు 35 మంది జాతీయస్థాయిలో పాల్గొన్నారు. పిల్లలను ఒలింపిక్స్‌లో పాల్గొనేలా తీర్చిదిద్దుతా. గిరిజన శాఖ క్రీడా పాఠశాలలను ప్రోత్సహిస్తుంది.

– రమాదేవి, డీటీడీవో

మరిన్ని పతకాలు రావాలి



పారిస్‌లో ఒలింపిక్స్ దేశం నుంచి 117 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. 2021లో జరిగిన దేశం తరపున 7 మెడల్ సాధించారు. ఈ సారి మరిన్ని పతకాలు వస్తాయని ఆశిస్తున్నాం. అథ్లెటిక్స్‌లో మా స్కూల్ నుంచి ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనేలా తీర్చిదిద్దుతాను. – విద్యాసాగర్, అథ్లెటిక్స్ కోచ్ క్రీడాపాఠశాల

ఒలింపిక్స్‌లో ఆడాలని..



మాది మారుముల గిరిజన గ్రామం దంతన్‌పల్లి. 5వ తరగతిలో క్రీడ పాఠశాలలో చేరాను. అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నా. పీటీ ఉషను ఆదర్శంగా తీసుకుని ఒలింపిక్స్‌లో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నా.

– మాదావి చిన్నుబాయి 9వ తరగతి

క్రీడాల్లో రాణిస్తా



కోహినూర్ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ప్రోత్సాహంతో ఆసిఫాబాద్ స్పోర్ట్స్ స్కూ ల్‌కు వచ్చాను. ఉదయం, సాయంత్రం క్రీడల్లో మెలకువలు నేర్పిస్తున్నారు. జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో ఆడాను. పారిస్‌లో ఒలింపిక్స్ క్రీడల్లో దేశం నుంచి 117 మందిని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణిస్తా.

– శ్రీలత, 8వ తరగతి (స్పోర్ట్ స్కూల్)

జ్యోతిని ఆదర్శంగా తీసుకుంటా



దేశంలో తొలిసారి ఎర్రాజీ జ్యోతి హడిల్స్100 మీటర్స్ రన్నింగ్‌లో ఒలింపిక్స్‌లో పాల్గొంటుంది. గెలుపొంది దేశానికి ఆదర్శంగా నిలవాలి. జ్యోతిని ఆదర్శంగా తీసుకుని 8 మీటర్స్ హడిల్స్‌ను కోసం ప్రాక్టిస్ చేస్తున్నాను.

– నందిని, 9వ తరగతి (స్పోర్ట్ స్కూల్)

ఒలింపిక్స్‌పై అవగాహన



2023లో డిల్లీలో జరిగిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరుపున ఆడాను. క్రీడలంటే చాలా ఇష్టం. ఒలింపిక్స్‌పై పూర్తిగా అవగాహన వచ్చింది. వచ్చే ఒలంపిక్స్‌లో పాల్గొనేందుకు శ్రమిస్తు న్నా. ప్రతిరోజూ హ్యాండ్ బాల్ ప్రాక్టీస్ చేస్తున్నాను.

– ముత్తుబాయి (9వ తరగతి)

ఎస్టీపీపీలో ఈఎస్ఐ!

- జైపూర్ పవర్ ప్లాంటులో ఆస్పత్రికి ఏర్పాట్లు
- అందుబాటులోకి వైద్యసేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు



జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో నూతనంగా ఈఎస్ఐ(ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్) ఆస్పత్రి నిర్మాణం జరగనుంది. ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్. బలరాం ప్రకటించడంతో కాంట్రాక్టు కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులోకి వైద్య సేవలందనున్నాయి.

వెయ్యికిపైగా కార్మికులు..

పవర్ ప్లాంటు విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న పవర్‌మేక్ కంపెనీతోపాటు దానికి సబ్ కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తున్న పలు కంపెనీల్లో సుమారు 1000 మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు ఆయా విభాగాల్లో మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభావిత భూ నిర్వాసితులతోపాటు ఆయా రాష్ట్రాలకు చెందినవారు పనిచేస్తున్నారు. పవర్ ప్లాంటు నుంచి వస్తున్న కాలుష్యంతో వ్యాధులు, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లుగా స్థానికులు ఉన్నతాధికారులకు విన్నవించారు. ఆస్పత్రి నిర్మిస్తే కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబాలతోపాటు స్థానికులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. 2017లో పవర్ ప్లాంటు ప్రారంభదశలో అప్పటి సీఎం కేసీఆర్ ఇక్కడ నేరుగా ప్రారంభోత్సవానికి వస్తే అనేక సమస్యలు, శాశ్వత ఉద్యోగాల కల్పన కోసం ఎదురుచూశారు. ప్రధాని మోదీ గజ్వేల్ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా పవర్ ప్లాంటు ప్రారంభించారు. భూనిర్వాసితుల డిమాండ్లు, సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. కాగా, ఎట్టకేలకు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించిన సింగరేణి సంస్థ ఇక్కడ ఆస్పత్రి నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లుగా ప్రకటించడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రులు ప్రారంభించాలి

జైపూర్: సింగరేణి ప్రాంతంలో ఈఎస్ఐ ఆస్పత్రులు ప్రారంభించాలని ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్ కమల్ కిషోర్‌కి సింగరేణి సీఎండీ ఎన్.బలరాం శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో విస్తరించిన ఉన్న సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సౌకర్యార్థం కార్మిక రాజ్య బీమా సంస్థ(ఈఎస్ఐ) సేవలను విస్తరింపజేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. తొలుత జైపూర్ ఎస్టీపీపీలో ఈఎస్ఐ ఆస్పత్రి ప్రారంభించి సేవలను ప్రారంభించాలని కోరారు. సింగరేణి తరపున మౌలిక సదుపాయాలైన క్వార్టర్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాగా, తొలుత ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఏర్పాటు చేసి అవసరం మేరకు ఆస్పత్రిగా మార్చేందుకు కృషిచేయనున్నట్లుగా హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

- నిందితుల్లో యువకుడితోపాటు ఇద్దరు మైనర్లు
- 200 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం



పట్టుబడిన యువకుడితో పోలీసులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో అక్రమంగా గంజాయి అమ్ముతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బెల్లంపల్లి బాబుక్యాంపు బస్తీకి చెందిన యువకుడు బండి సూర్యతేజ, మరో ఇద్దరు మైనర్లతో స్నేహం చేసి ముగ్గురు కలిసికట్టుగా గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారు. ఏడాది నుంచి ముగ్గురు మహారాష్ట్రలోని చంద్రాపూర్, బల్లార్షా రైల్వేస్టేషన్లలో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి బెల్లంపల్లిలో అధిక ధరకు అమ్మకాలు చేస్తున్నారు. గంజాయికి బానిసయ్యారు. పక్షం రోజుల క్రితం ముగ్గురు కలిసి బల్లార్షాకు వెళ్లి రూ.7,500 చెల్లించి గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయిని కొనుగోలు చేశారు. బెల్లంపల్లికి వచ్చి 300 గ్రాముల గంజాయిని అధిక ధరకు అమ్మిన డబ్బులతో జల్సాలు చేశారు. గురువారం మధ్యాహ్నం కన్నాలబస్తీ శివారు ప్రాంతంలో వ్యవసాయమార్కెట్ కమిటీ యార్డు వద్ద గంజాయి అమ్మకం కోసం వేచి చూస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. అక్కడికి వెళ్లిన పోలీసుల వాహనాన్ని చూసి సదరు వ్యక్తులు పారిపోయేందుకు యత్నించడంతో పట్టుకున్నట్లు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి 200 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ ప్రకటించారు.

చైర్‌లిఫ్ట్ పనులు సత్వరం పూర్తిచేయాలి



గనిలో దిగేందుకు సిద్ధమైన జీఎం, తదితరులు

బెల్లంపల్లి: శాంతిఖని భూగర్భ గనిలో చేపట్టిన మ్యాన్ వైండింగ్ చైర్‌లిఫ్ట్ కొనసాగింపు పనులను సత్వరం పూర్తి చేయాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శాంతిఖని షాఫ్ట్ మైన్‌ను సందర్శించారు. జీఎం అధికారులతో కలిసి గని భూగర్భంలో దిగారు. అండర్ గ్రౌండ్‌లో జరుగుతున్న చైర్‌లిఫ్ట్ కొనసాగింపు పనులు పర్యవేక్షించి బోల్టర్ మైనర్ యంత్రం పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ గని భూగర్భంలో కొన్నిరోజుల నుంచి జరుగుతున్న చైర్ లిఫ్ట్ కొనసాగింపు పనులను వేగవంతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆలస్యం కాకుండా త్వరితగతిన పూర్తి చేసి కార్మికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్మికులు ఇబ్బందులకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గని ప్రాజెక్టు అధికారి ఆర్.విజయప్రసాద్, గ్రూప్ ఇంజినీర్ బసవరాజు, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, గని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి సంస్మరణ వారోత్సవాలు

- మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జులై 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు పార్టీ)కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ తెలిపారు. ఈమేరకు లేఖ విడుదల చేశారు. సాయుధ రైతాంగ తిరుగుబాటు నుంచి నేటి ప్రజాస్వామిక విప్లవం కోసం 50 ఏళ్లుగా ప్రజాయుద్ధం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో కీలక నాయకులు చారుమజుందార్, కనాయ్ చటర్జీ అమరులయ్యాని వెల్లడించారు. ఇదేక్రమంలో గతేడాది 194 మంది కామ్రేడ్స్ ప్రభుత్వ ప్రతిఘాతక చర్యల్లో అమరులయ్యాని తెలిపారు. వీరి సంస్మరణార్థం జులై 28 నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో అమరులకు జోహార్లు అర్పిస్తూ వారి ఆశయ సాధనకు పునరంకితమవుదామని పేర్కొన్నారు. గ్రామాలు, బస్తీల్లో అమరవీరుల స్తూపాలను నిర్మించి వారి త్యాగాలను ప్రచారం చేస్తూ అమరుల ఆదర్శాలు చాటాలని కోరారు.

తాగిన మైకంలో కుమారుడిపై దాడి

- గాయాలతో బెల్లంపల్లికి తరలింపు
- మండల కేంద్రంలో ఘటన
- పోలీసుల అదుపులో తల్లిదండ్రులు



తీవ్రగాయాలతో కొడుకు శేఖర్

నెన్నెల: తాగిన మైకంలో కుమారుడిపై తల్లిదండ్రులు కొడవలితో దాడికి పాల్పడ్డారు. మండల కేంద్రంలోని పోచమ్మవాడలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై ప్రసాద్ కథనం ప్రకారం.. అబ్బర్ల విజయ్–పద్మ దంపతులు గురువారం సాయంత్రం రెండో కుమారుడు అశోక్‌తో మద్యం మత్తులో గొడవ పడ్డారు. అదే రాత్రి అశోక్ పడుకునే స్థలంలో అన్నయ్య శేఖర్ నిద్రపోయారు. రాత్రి సమయంలో అశోక్ అనుకొని శేఖర్‌ను తల్లి పద్మ తప్పించుకోకుండా కాళ్లు పట్టుకోగా, తండ్రి విజయ్ కొడవలితో పొట్టపై దాడి చేశాడు. తప్పించుకోవడానికి ప్రయత్నించగా ఎడమ చేయి మణికట్టు కోసుకుపోయింది. అశోక్‌పై దాడి చేయాలని అనుకున్న తల్లిదండ్రులు తాగిన మైకంలో ఆ స్థానంలో నిద్రిస్తున్న పెద్ద కొడుకుపై దాడికి పాల్పడ్డారు. తల్లిదండ్రులు మత్తులోకి జారుకున్నారు. ఉదయం శేఖర్ పెద్దనాన్న, ఇరుగుపొరుగు వారు ఇంటికి వచ్చి చూసేసరికి శేఖర్ గాయాలతో ఉన్నాడు. వెంటనే వారు అందించిన సమాచారంతో పోలీసులకు అక్కడికి చేరుకొని శేఖర్‌ను బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విజయ్, పద్మను అదుపులో తీసుకున్నారు. శేఖర్ పెద్దనాన్న అబ్బర్ల రాజం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడ్డ నక్క



బావిలో కర్రను ఆసరాగా పట్టుకున్న నక్క

జన్నారం: ప్రమాదవశాత్తు నక్క వ్యవసాయ బావిలో పడిపోగా అటవీ అధికారులు గ్రామస్తుల సహాయంతో కాపాడారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజొద్దీన్ కథనం ప్రకారం ..జన్నారం మండలం బంగారుతండా సమీపంలోని వ్యవసాయ బావిలో నక్క ప్రమాదవశాత్తు పడిపోయింది. బావిలో ఉన్న కర్రను ఆసరాగా తీసుకుని బయటపడేందుకు ప్రయత్నించింది. రైతు గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. బీట్ అధికారులు గ్రామస్తుల సహాయంతో నక్కను బావిలో నుంచి వల సహాయంతో బయటకు తీశారు. నక్కను అడవిలోకి వదిలేసినట్లు రేంజ్ అధికారి తెలిపారు.

ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న జార్జిజాస్

నస్పూర్: ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నామని డీఎంఎస్ (మెడికల్) జార్జిజాస్ తెలిపారు. వృత్తిపరమైన ఆరోగ్య సమస్యలు, భవిష్యత్తు ప్రణాళికలు అనే అంశంపై శుక్రవారం సీసీసీ సింగరేణి గెస్ట్‌హౌస్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు వైద్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏరియా జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు చర్చించడం అభినందనీయమన్నారు. కార్పొరేట్ జీఎం గురువయ్య, చీఫ్ మెడికల్ ఆఫీసర్ సుజాత, బెల్లంపల్లి జీఎం రవిప్రసాద్, బెల్లంపల్లి, కొత్తగూడెం రీజియన్ల సేఫ్టీ జీఎంలు రఘుకుమార్, తివారి, అధికారులు శ్రీనివాస్, వైద్యులు పద్మజ, ఉష, అరవిందరావు, వెంకటేశ్వర్‌రెడ్డి, వైద్యాధికారులు, రక్షణాధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రులను సాంకేతికంగా అభివృద్ధి

నస్పూర్: సింగరేణి ఆధ్వర్యంలోని అన్ని ఆసుపత్రులను సాంకేతికంగా అభివృద్ధి చేస్తామని జీఎం సేఫ్టీ గురువయ్య తెలిపారు. శుక్రవారం ఆయన ఏరియా జీఎం సంజీవరెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ సుజాతతో కలిసి నస్పూర్ డిస్పెన్సరీలో ఆధునీకరించిన ఆక్యుపేషనల్ హెల్త్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఉద్యోగుల, వారి కుటుంబ సభ్యుల సంబంధిత అంశాలను సింగరేణి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా రికార్డు చేస్తామన్నారు. బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ రఘుకుమార్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సివిల్ డీజీఎం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

Omprakash Deora People's Co-Op. Bank Ltd., Hingoli.
(Multi-state Bank)
Head Office, Main Road, Hingoli Dist. Hingoli - 431513 (M.S.)
Tel No. 9172046955

Notice of The Annual General Meeting

42nd Annual General Meeting of the Bank will be held on **11th August 2024 at 11.30 am at Mahaveer Bhawan, Ramleela Maidan, Hingoli** to transact following business. All Member s are requested to attend the meeting on time.

1. To read & confirm the proceedings of the last Annual General Meeting held on 06/08/2023.
2. To adopt the Annual Report for the financial year ended as on 31.03.2024 along with Balance sheet, Profit & Loss A/c.
3. To approve Statutory Auditors Report & rectification report for the year 2023-2024.
4. To consider and approve the appropriation of Profit for the year 2023-24 and declare the Dividend as recommended by the Hon'ble Board of Directors subject to approval from RBI.
5. To consider and approve the expenditure which is in excess than the budget for the year 2023-2024.
6. To consider and adopt the budget for the year 2024-25 as recommended by the Hon'ble Board of Directors.
7. To consider and approve Appointment of Statutory Auditor for the year 2024-25.
8. To approve the appointment of concurrent auditors appointed by the Bank for the year 2024-2025.
9. To grant leave of absence to those members of the Bank who have not attended this AGM.
10 Inquiring about the outstanding loans of bank directors and their relatives for the financial year 2023-2024 (as per Section 39(3) of the Multistate Co-op. Societies Act 2022)
11 To consider and approve the recommendations made by the Board of Directors (together with the community) regarding the amendment in the existing bye-laws of the Bank. (Subject to approval of Reserve Bank and Central Registrar, New Delhi)
12 Approval of write off of the NPA accounts in the Financial Year 2023-24.
13 Approval of OTS cases in the Financial Year 2023-24
14. To discuss any other subject with the permission of Hon'ble. Chairman.

Place : Hingoli
Date : 26/07/2024

By order of the Board of Directors
(Sudhir Jalanapure)
(Chief Executive Officer)

Notes:
1. If there is no requisite quorum, the meeting will stand adjourned and the same will be conducted after one hour and for which no quorum will be necessary.
2. Members are requested to bring their copy of Annual Report at the time of meeting.
3. Member who wish to have any additional information or those who wish to make any suggestion should submit their request in writing at Head Office of the Bank on or before 30 July 2022 during office hours.
Note - A copy of the Report is sent to all the members. In case any member has not received, please collect it from any branch office during working days and hours.

జలపాతాలు భళా..



చూపరులను ఆకట్టుకుంటున్న కొరిటికల్ జలపాతం



జాలువారే అందాలతో కుంటాల జలపాతం



అబ్బురపరుస్తున్న పొచ్చర జలపాతం

ఆదిలాబాద్ జిల్లా అంటేనే అందమైన అడవులు.. ఆ మధ్యన అబ్బురపరిచే జలపాతాలు ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతాల అందాలు ప్రస్తుతం పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. నేరడిగొండ మండలంలోని కుంటాల, కొరటికల్, బోథ్ మండలంలోని పొచ్చర జలపాతాలు నిండా నీటితో జాలువారుతూ అబ్బురపరుస్తున్నాయి. జిల్లా నుంచే కాక మహారాష్ట్ర నుంచి పర్యాటకులు తరలివచ్చి వీక్షిస్తున్నారు. కెమెరాలు, సెల్‌ఫోన్లలో ఇక్కడి అందాలను క్లిక్‌మనిపిస్తున్నారు. ఆయా చోట్ల పర్యాటకుల సౌకర్యార్థం, రక్షణార్థం కోసం అధికారులు పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

– నేరడిగొండ

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్&డిస్టెన్స్ అడ్మిషన్స్:డిగ్రీ,PG, B.Tech ,Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్), GNM. * 4 నెలల్లో పరీక్షలు 8866977112, 339 [HA-16328]

SERVICES

OLD AGE HOME

■ త్రినేత్రహోంకేర్ వృద్ధులను,పేషెంట్స్‌ను, చంటిపిల్లలను, వంట / ఇంటిపని 24 గం॥లు చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే కేర్ టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్: 7396857799,7396753377 [H-796261]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185365]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటిపని,వంటపనికి వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి + భోజనం. జీ: 20 K. ఫోన్: 8977639662, 8977639663 [H-796259]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,